


**"మీరు యింటికి వచ్చిన వెంటనే మీ నాన్న గారు కన్పించమన్నారు" అంది రేవతి, ఆఫీసు నుంచి వచ్చిన భర్తకు 'టీ' అందిస్తూ.**

"ఎందుకట" అన్నాడు కప్పు అందుకుంటూ రాజేష్.

"ఏమో నాకేం తెలుసు. మీతోపాటు నన్ను కూడా రమ్మన్నారు. నిన్ననే రిటైరయ్యారు కదా ఏమన్నా మాట్లాడాలనేమో."

"ఇంట్లో లేరా?"

"లేరు. బయుట కెళ్ళారు. అత్తయ్యగారికీ పూట జ్వరం వచ్చింది. డాక్టరు దగ్గర కెళ్ళారేమో."

రాజేష్ టీ తాగి బట్టలు మార్చుకున్నాడు. అతనికి అసహనంగా వుంది. స్నానం చేసొచ్చి క్రిందకు వెళ్ళి తల్లిని చూసొచ్చాడు. ఆమెకు సంవత్సరం నుంచీ ఆరోగ్యం సరిగ్గా వుండడం లేదు. అప్పుడప్పుడు జ్వరం వస్తుంది. డాక్టరు దగ్గరకు తీసుకెళదామన్నా తీరడం లేదు. తండ్రే తీసుకెళ్ళి చూపిస్తున్నాడు. ఎవరైనా స్పెషలిస్టు దగ్గరకు తీసుకెళ్ళి ట్రీట్మెంటు ఇప్పిద్దామంటే వీలుకావడం లేదు. వీలెందుకు కావడం లేదని ఎవరైనా అడిగితే సమాధానం చెప్ప లేదు. వారం రోజుల క్రితం రేవతి మామూలు తలనొప్పితో బాధపడుతుంటే స్పెషలిస్టుకు చూపించినప్పుడు అతనికి తల్లి గుర్తుకురాలేదు.

ఇంతలో రేవతి కూడా స్నానం చేసి వచ్చింది. తల్లో మల్లెపూలు పెట్టుకుని అందంగా అలంకరించుకుని వచ్చి భర్త ప్రక్కన కూర్చుంది. రాజేష్‌కి భార్యంటే ప్రాణం. మనుష్యల మీది యిష్టాయిష్టాల్ని ఆమె తన కళ్ళలో ప్రతిబింబించేలా చేస్తుంది.

నారాయణరావుగారు డాక్టరును తీసుకొచ్చి భార్యను చూపించారు. మందులు రాసిస్తే వాటిని తెచ్చి భార్య చేత మింగించారు. మందు లేసుకున్న తర్వాత ఆమె పడుకుంది. ఆయన బయట కొచ్చి వరండాలో వున్న వాలు కుర్చీలో పడుకుని ఏదో ఆలోచిస్తున్నారు. తను నిన్ననే రిటైరయ్యాడు. రేపటి నుంచీ ఎలా గడపాలి? ముందు భార్యకు ఆరోగ్యం సరి చెయ్యాలి. ముప్ఫయి సంవత్సరాల పాటు తనతో సహ జీవనం చేసింది. తన కెంతో సేవ చేసింది. ఇప్పు డామెకు తను సేవ చేయడం బాధ్యత. ఇంటి ముందున్న గార్డెన్ లోని నైట్‌క్వీన్ మొక్క నుంచి వస్తున్న సువాసన మనస్సు కెంతో హాయినిస్తోంది.

అయిదు సంవత్సరాల పూర్వమే ఆఫీసులో పి.ఎఫ్., ఎల్.ఐ.సి. లోన్సు పెట్టి ఇల్లు కట్టించారు. కొడుకు, కోడలు వుంటారని పైనొక బెడ్ రూము కూడా వేయించారు.

నిన్నటి వరకు ఏ లోటూ లేకుండా జీవితం గడిచిపోయింది. రేపటి నుంచీ ఎలా వుంటుందో. తన జీతం, కొడుకు జీతం కలిపితే కుటుంబం బాగానే గడిచిపోయేది. మరిప్పుడు జీతం రాదు. కేవలం పెన్షను మాత్రమే వస్తుంది. అయినా తామిప్పుడు బ్రతకడానికి ఆర్థిక ఇబ్బందులేం లేవు. కొడుక్కి జీతం బాగానే వస్తుంది. ఉన్నది ఒక్కడే కొడుకు. ఎంతో కష్టపడి చదివించి ఆఫీసర్ని చేశాడు. తనంటే కొడుక్కి ప్రేమే. తనూ, భార్య ఈ శేష జీవితాన్ని ఏ లోటూ లేకుండా హాయిగా కొడుకు, కోడలు దగ్గర గడిపెయ్యాలి.

"నాన్నా పిలిచారట" అంటూ వచ్చాడు రాజేష్ భార్యతో కలసి.

"రా బాబూ కూర్చో, నువ్వు కూడా కూర్చో అమ్మా" అన్నారాయన.

రాజేష్, రేవతి అక్కడున్న కుర్చీల్లో కూర్చున్నారు.

సమయం ఏడు గంటలు దాటిందేమో చీకటి పడుతోంది బయుట. రేవతి లేచి లేటు వేసింది. నారాయణరావుగారొక్కసారి కొడుకూ, కోడలి ముఖాలలోకి చూశారు.

"డాక్టరుగారేమన్నారు నాన్నా" అడిగాడు రాజేష్.

"ఏం అన్లేదు మందులు రాసిచ్చారు. అవి వాడితే తగ్గిపోతుందన్నారు. ఎవరికైనా స్పెషలిస్టుకి చూపిస్తే మంచిదనుకుంటున్నాను" అన్నారాయన.

రాజేష్ ఏమీ మాట్లాడలేదు.

కాస్సేపు అక్కడంతా మౌనం తాండవించింది.

"ఏమన్నా చెప్పాలనుకుంటున్నారా నాన్నా" రాజేష్ అడిగాడు.

"అవును బాబూ! ఈ రోజు కాస్సేపు నీతో మాట్లాడాలని పిలిచాను. రోజూ మనిద్దరం ఎవరి ఆఫీసు పనుల్లో వాళ్ళం బిజీగా వుండే వాళ్ళం. నా కింక తీరికే. రేపటి నుంచి నా జీవితం నా చేతుల్లో వుండదు కదా! అందుకే కొన్ని విషయాలు చెప్పాలనిపించింది" ఆగారాయన.

రాజేష్ టైము చూసుకున్నాడు. అప్పుడే ఎనిమిది కావస్తోంది. రేవతి వంటికి రాసుకున్న పెర్ఫ్యూమ్స్, తల్లోని మల్లెపూల వాసన తగులుతుంటే రాజేష్‌కి మత్తుగా వుంది. భోజనాలు పూర్తిచేసి, ఎప్పుడెప్పుడు పైకి పోదామా అని వుంది. ఈయన ఎంతసేపు మాట్లాడతారో?


"చూడు బాబూ! నీకు వూహ తెలిసిన దగ్గర నుంచీ మన జీవితాలు నీకు తెలుసు. దాని గురించి యిప్పుడు మాట్లాడ్డం లేదు. నీకు తెలియని నా జీవితం గురించే చెప్పాలనుకుంటున్నాను. నేను చాలా పేద కుటుంబంలో పుట్టాను. ఒక్క పూట తింటే మరొక పూట తిడి వుండేది కాదు. మాది చాలా పెద్ద కుటుంబం. మా నాన్న సంపాదించేది ఏ మూలకూ సరిపోయేది కాదు. నాకు చదువుకోవాలని వుండేది, కాని నన్ను చదివించడానికి మా నాన్నకి శక్తిలేదు. రాత్రిళ్ళు పనిచేసి పగలు చదువుకునే వాణ్ణి. ఎలా అయితేనేం స్కూలు ఫైనలు పూర్తిచేశాను. వెంటనే ఉద్యోగాలు ఎక్కడ దొరుకుతాయి? ఓ కొట్లో సామాను అందించడానికి కుదిరాను.

ఇంటికి పెద్ద కొడుకు నేమో నాకు పెళ్ళి చెయ్యడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అప్పుడే పెళ్ళొద్దని ఎంత మొత్తుకున్నా పెళ్ళి ఆగలేదు. మీ అమ్మను పెళ్ళాడాను. ఆమె నిజంగా దేవత. ఎన్ని కష్టాలయినా

16-9-91

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

— కట్టా రాంబాబు



సంతోషంగా స్వీకరించేది.

బాబూ! అప్పుడే నిర్ణయించుకున్నాం నా చాలీ చాలని ఆదాయంతో, కడు పేదరికంతో వున్న మేము యింకొకరికి చోటివ్వకూడదని. అందుకే నీ పుట్టుకని చాలాకాలం వాయిదా వేసుకున్నాము. పల్లెటూళ్ళలో పెళ్ళయి చాలా కాలమయినా పిల్లలు పుట్టడం లేదంటే ఎన్ని అభాండాలకు గురికావాలో అన్నింటికీ గురయింది మీ అమ్మ. గొడ్రాలు అనే ముద్ర కూడా వేయించుకుంది. అయినా సరే మేము అనుభవించే కష్టాలు పిల్లలు అనుభవించకూడదని మా ఆర్థిక పరిస్థితి మెరుగయ్యే వరకు పిల్లల కోసం తొందరపడకూడదని నిర్ణయించుకున్నాము. కుటుంబ నియంత్రణకు యిప్పుడున్న సాధనాలు అప్పుడుండేవి కాదు కాబట్టి మేమెంత నరకం అనుభవించామో యిప్పుడు చెపితే అర్థం కాదు మీకు.

ఎంతో కాలంగా ప్రయత్నం చేస్తుంటే ఓ ఆఫీసులో చిన్న గుమస్తా వుద్యోగం దొరికింది. అప్పుడు మా ఆనందం వర్ణనాతీతం. ఆ కొద్ది పాటి ఆదాయంలో కొంత పుట్టబోయే పిల్లల కోసం పొదుపు చేసేవాళ్ళం. నా తండ్రికి ఎక్కువ మంది పిల్లలుండడం వల్ల నా పరిస్థితి ఎలా వుండేదో నాకు తెలుసు కాబట్టి మా జీవితంలోకి ఆడయినా, మగయినా ఒక్కర్నే ఆహ్వానించాలనుకున్నాం. నువ్వు పుట్టిన వెంటనే ఎంత మంది చెప్పినా వినకుండా ఆపరేషను చేయించుకున్నాను. నిన్ను చిన్నప్పట్నించీ అల్లారు ముద్దుగా పెంచుకున్నాము. నీకు చీమ కుట్టినా మీ అమ్మ సహించలేకపోయేది. నీ కోసం ఎన్ని త్యాగాలు చేసామో చెపితే అర్థం కాదు. కన్న పిల్లల కోసం తల్లిదండ్రులు చేసేవి త్యాగాలెందు కవుతాయి అనిపించవచ్చు. నువ్వు ఎటువంటి ఆర్థిక ఇబ్బందులకూ గురికాకూడదనీ, నీ చదువుకి అది అడ్డు రాకూడదనీ మేము నెలలో ఇరవై రోజులే రెండు పూటలూ భోజనం చేసేవారమనీ, మిగిలిన పది రోజులూ ఒక పూటే తినే వారమనీ నాకూ మీ అమ్మకూ తప్ప యింకెవరికీ తెలియదు.

యివన్నీ అతిశయోక్తులుగా వుండొచ్చు నీకు. మేము పడ్డ ఎటువంటి కష్టమూ నీకు కలగకూడదనేదే మా తాపత్రయమంతా. తిండి, బట్టలు మొదలైనవాటి గురించి ఆలోచించకుండా ప్రతి పైస కూడబెట్టాం. మేం చేసే ఏ పనీ నీకు తెలియనిచ్చే వాళ్ళం కాదు. నీ స్కూలు ఫైనలు ఫీజు కట్టడానికి సమయానికి చేతిలో డబ్బు లేకపోతే తన మంగళసూత్రం తాకట్టు పెట్టించి నీకు ఫీజు కట్టించింది మీ అమ్మ. చిన్నప్పుడోసారి నీకు టైఫాయిడ్ వస్తే అది తగ్గేంత వరకు నోట ముద్దపెట్టకుండా, కంటి మీద కునుకు లేకుండా వుందంటే ఎవరూ నమ్మర్రు బాబూ...యిలాంటి వెన్నో చెప్పాలన్నా గుర్తురావడం లేదు.

నాది చిన్నప్పటినుంచీ కష్టపడి పనిచేసే మనస్తత్వమేమో ఉద్యోగంలో కూడా నేను కష్టపడేవాణ్ణి. పై అధికార్ల మన్ననలు పొందుతూ అంచెలంచెలుగా పైకొచ్చి ఆఫీసు సూపరిండెంటుగా రిటైరయ్యాను. నీకోసం ఆస్తులేమీ సంపాదించలేదు బాబూ. ఆఫీసులో అప్పచేసి ఈ యిల్లు కట్టించాను. పి.ఎఫ్, గ్రాట్యుయిటీ, ఎల్.ఐ.సి రూపంలో వచ్చే మొత్తాలన్నీ నీ పేరన ఫిక్స్‌డ్ వేద్దామనుకుంటున్నాను. యింక పెన్షనంటావా ఏదో వేన్నీళ్ళకు చన్నీళ్ళ సాయంగా వుంటుంది.

యింక మీ అమ్మా, నేనూ ఈ శేష జీవితాన్ని ఏ చీకూచింతా లేకుండా మీ సమక్షంలో గడపాలనేదే మా ఆశ. ఎంతో మంది పిల్లలు తమ తల్లిదండ్రులను అవసానదశలో ఎంత హీనంగా చూస్తున్నారో నాకు తెలుసు ఆ వయస్సులో వారెంత మానసిక బాధలకు గురవుతున్నారో నాకు తెలుసు. అటువంటి దుస్థితి ఎవరికీ రాకూడదు. అలాంటి పరిస్థితి మాకు రాదని తెలుసు. అందరూ నన్ను "నువ్వు చాలా అదృష్టవంతుడివోయ్ నారాయణరావు" అంటారు.

అవును బాబూ! నేను నిజంగా అదృష్టవంతుణ్ణే. నా కొడుక్కి తను కోరుకున్న చదువు చెప్పించాను. ప్రేమించిన అమ్మాయితో పెళ్ళి జరిపించాను. నా కొడుకు ఎటువంటి జీవితాన్ని కోరుకున్నాడో అటువంటి జీవితాన్ని అందించాను. మా జీవితాలు కూడా సుఖంగా నా కొడుకు సన్నిధిలో పూర్తయిపోతాయి యిటువంటి అదృష్టం ఎంతమందికి వుంటుంది చెప్పు.

యివే బాబూ నేను చెప్పాలనుకున్నది. ఈ యింట్లో మా కళ్ళ ఎదురుగా మీరిద్దరూ చిలకా గోరింకల్లా కాలం గడుపుతుంటే చూస్తూ సంతోషంగా కాలం గడిపెయ్యాలన్నదే మా కోరిక. ఈ విషయం నీకు తెలియదని కాదు ప్రత్యేకించి చెప్పడం. ఏదో నా మనస్సులోని మాట చెప్పానంతే. యిప్పటికే చాలా టైమయింది. వెళ్ళి భోజనం చెయ్యండి" అన్నారు నారాయణరావు గారు.

నెమ్మదిగా అక్కడనుంచి లేచి డైనింగ్ హాల్లోకి నడిచారు. రేవతి నారాయణరావు గారికి చపాతి, అత్తగారికి పాలు యిచ్చి వచ్చింది. రాజేష్, రేవతి మౌనంగా భోజనాలు ముగించి పైకి వచ్చేసారు.

రాజేష్ మంచంమీద కూర్చుని పేపరు చూస్తుంటే రేవతి బట్టలు మార్చుకుని నైటీ వేసుకొచ్చి భర్త ప్రక్కన కూర్చుంది. తెల్లని ట్రాన్స్‌ఫరెంట్ నైటీలోనుంచి కన్పిస్తున్న రేవతి అందాలు రాజేష్‌ను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఎప్పుడూ తాంబూలం వేసుకున్నట్టుండే రేవతి పెదాలు కవ్విస్తున్నాయి. చదువుతున్న పేపరును పక్కన పడేసి రేవతి నడుము చుట్టూ చేయి వేసి దగ్గరకు లాక్కున్నాడు.

"ముసలాయన భలే బోరు కొట్టించేసాడు కదూ. ఆయనకీమధ్య చాదస్తం పెరిగిపోయింది. ఆ చాదస్తంతో మన మెక్కడ పడగలంగానీ మనం దూరంగా ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్ళిపోదాం" అంటూ భార్యని కౌగిలిలో బంధించాడు రాజేష్. తన మనస్సులోని మాటే భర్త నోట వచ్చినందుకు ఆమె కళ్ళు ఆనందంతో నవ్వుతున్నాయి. ●